మరలి వచ్చిన మనస్సు

శరణాలయంలోని సన్నగదిలో, కొయ్య కుర్చీలో కూర్చుని అనుకున్నాడు మాధవ రావు—తను యీ ఉత్తర ప్రత్యుత్తరాలు ఎందుకు జరిపాడా అని. మద్రాసులో వుండగనే వితంతు శరణాలయానికి ఉత్తరాలు వ్రాసి, తనకోరిక వెలిబుచ్చాడు. వాళ్ళు రాధఫోటో పంపడం, తననిశ్చయంగా వచ్చి ఆమెను చూడవలసిందిగా వ్రాయడం, అన్నీ త్వరితంగా జరిగిపోయాయి. ఫోటోలోని ఆ ముఖాన్నే తలచుకుంటూవచ్చాడు అతను శరణాలయానికి.

సన్నగదిలో, బల్లకి రెండు వేపులావున్న రెండుకుర్చీల్లో మాధవరావు, శరణాలయం సూపరింటెండెంటు కూర్చున్నారు. 'రాధకి చిన్నతనంలో వివాహం జరిగింది. 13 సంవత్సరాలకు భర్తపోయాడు. గృహచ్ఛిద్రము, దుర్భరంగా పరిణమించిన వైధవ్యము, యింకా ఎన్నో తెలియని బాధలు ఆమెను ఊపివేశాయి. రెండుసంవత్సరాలక్రితం వచ్చింది ఆమెశరణాలయానికి—ఆత్మహత్యా ప్రయత్నంలో ఉండగా, గోదావరిలోంచి రక్షించబడి. ఆమెదికూడా మాధవరావు కులము, శాఖే. ఆమె యీ సంవత్సరం మెట్రిక్ పరీక్షకు వెళ్ళింది. వీణవచ్చు. చేతి పనులు నేర్చుకుంటోంది.' సూపరింటెండెంటు చెప్పినదంతా విన్నాడు మాధవ రావు. ప్రశ్నలు వేయలేదు. ఇదివరలో తనకి వాళ్లు ఉత్తరాల్లో వ్రాసినదే మళ్ళీ చెప్పింది ఆవిడ.

...రాధఫోటో చూసినరోజే ఆ ఫాల భాగం, నొక్కులజుట్టుచూసి ముగ్ధుడైనా డతను. కళ్ళల్లో బెరుకు, అమాయకత్వం—కానీ నోరుమాత్రం చిరునవ్వుకోసం మెదుపుతున్నట్టుంది. ఈ అమ్మాయి చాలామంచిది అనుకున్నాడు మాధవరావు మరుక్షణానే. ఫోటోలోనిరాధ ఫాలభాగంమీద వేలుంచి, తప్పుచేసినవాడల్లే చటుక్కున తీసేశాడు అతను......

రాధవచ్చింది. తెల్లచీర, చేతులకు నల్లని గాజులు. సూపరింటెండెంటు ప్రక్కన నిలబడింది. సూపరింటెండెంటు చెప్పిందిఆమెకి "వీరే మాధవరావుగారు" అని, ఆమె లేచి, రాధనికూర్చోమని ఆదేశించింది. మాధవరావు వేపుచూసి, "మీరు ఏమైనా చెప్పాలనుకుంటే చెప్పవచ్చు"అని బయటకు వెళ్ళింది ఆమె.

రాధ తలవంచుకుని కూర్చుంది. ఐదు నిముషాలు నిశ్శబ్దంగా నడిచాయి. మాధవ రావు లేచి నిలబడ్డాడు. "మీరు ... మీరు నాతో మాట్లాడవల్సినది ఏమీ లేదూ?" అన్నాడతను.

రాధ తలెత్తి అతనివంక చూసింది. ఆమె కళ్ళు విశాలంగా వున్నాయి. "నన్నుగురించి ఆవిడ అంతా చెప్పారనుకుంటాను..." ఆమె కంఠం సున్నితంగా వుంది. ఉచ్చారణ బాగుంది అనుకున్నాడుమాధవరావు. "మీకు అభ్యంతరం లేదూ? ... మీకు బంధువులు లేరూ?" అన్నాడతను.

"ఉన్నారు. కానీ నేను బ్రతుకున్నట్టు తెలియదు వాళ్ళకి ... తెలియజేయలేదు ... మీవాళ్లు, మీవాళ్ళకేమీఅభ్యంతరం లేదూ?" అన్నదామె సంకోచంతో.

"ఉంటుంది. కానీ నాకుపట్టదు. వివాహం ఏర్పాటుచేస్తాను — మీకు నన్నుగురించి అంతా తెలుసుకదూ?" ఆమె తలూపింది.

యం. జానకీరాణి

"నేను వెళ్ళి వస్తాను. రేపు ఫారంతీసుకు వస్తాను. సంతకాలుచేద్దాం. రెండు నెలల్లో నే పెళ్ళి ... నాకు ఉత్తరాలు వ్రాస్తూండండి యీ రెండు నెలల్లో — వస్తాను." అన్నాడతను తలుపుదగ్గర కెడుతూ:

రాధ కూర్చునే వుంది. ఆమె ముఖం ఎర్రబడుతూండడం చూశాడతను. తలుపు దగ్గర ఒక్క నిముషంఆగి, "ఏమంటారు?" అన్నాడు.

ఆమె చటుక్కున తలెత్తిచూసింది. ఆమె పెదవులు అస్పష్టంగా కదిలాయి.

"వస్తాను నేను — రేపు." అన్నాడతను.

*   *   *

మాధవరావు పెళ్ళైన తర్వాత తనమిత్రులను చాలా మందిని కలుసుకున్నాడు. కాని విందులు వేడుక లేమీ ఏర్పాటు చేయలేదు తన వివాహ సందర్భంలో.

ఒకరోజు మిత్రుడు రాజుతోకలిసి, పార్కునుంచి యింటికివస్తుండగా అన్నాడు రాజు "చూడు మాధవా, నవ్వు నిజంగా చాలా గొప్పవాడివని ఒప్పుకోవాలి ఎవరికుంటుంది యీ ధైర్యం, అంతా వేదిక లెక్కి కబుర్లు చెప్పిన వాళ్ళు మే......"

మాధవరావుకి అర్థంకాలేదు "ఏ సంగతి నువ్వు మాట్లాడేది?" అన్నాడతను.

రాజు నవ్వాడు. "అక్కడే వున్నది మరి నీ గొప్పతనం.మనవాళ్లంతా ఎంతగా మెచ్చుకుంటున్నారో నీకు తెలియదు. నువ్వు వితంతువును పెళ్లాడ్డమనేది చాలాముందడుగు వేయడమన్నమాట...నాకు క్కడ అనిపిస్తుంది. నేననుకున్నవన్నీ ఎల్లాగాలిలో కలిసిపోయాయో తల్చుకుంటే. నాకూవుండేవి ఆశయాలు...ఏదో ప్రవాహంలో దుఃఖ భాజనమై పోయేజీవితాన్ని ఒక తెప్పమీదకు చేర్చి ఒడ్డుకి తీసుకొచ్చావు. పూవనంలో విహరింప చేస్తున్నావు."

మాధవరావు మాట్లాడలేదు. అతను షాక్ అయ్యాడు—నిజానికి అందరికి తెలియదు రాధలాంటి భార్య వేయిజన్మలు తపస్సు చేసినా దొరకదని.

రాత్రి అతను డాబామీద పడుకుని నక్షత్రాలను చూస్తుంటేవచ్చింది రాధ. ప్రక్కనే వున్న పడుకుర్చీలో కూర్చుంది.

"ఏమి టాలోచిస్తున్నారు?" అన్నది. మాధవరావు ప్రక్కకు తిరిగి పడుకుని నవ్వాడు.

"నువ్వేమిటి ఆలోచిస్తున్నావు?" అన్నాడు. రాధ కిలకిలనవ్వింది "మీరేమిటి ఆలోచిస్తున్నారో అదే" అన్నది.

"నేనా—నువ్వునాకు దొరక్కపోతే నేను ఏమైపోయేవాడినా అని ఆలోచిస్తున్నాను."

"నిజంగా నేనూ అదే అనుకున్నాను సుమండీ, మీరు నమ్మరు-పైగా నేను నా మనస్సులో వున్నవన్నీ చెబితే నవ్వుతారు ... నన్ను మీదాపుగా తీసుకోకపోతే ఏమయ్యేదానినో!"

మాధవరావు లేచికూర్చున్నాడు "అల్లా అనకు. నేను నీకు ఎంత విలువ, నువ్వూ నాకు అంతే విలువ" అన్నాడతను.

"మీకు అర్థంకాదు, నా మనస్సు-నా హృదయంలో ప్రేమ మీరు సృష్టించినదే. ఈ జీవిత ప్రవాహంలో ... నా ప్రమోదు జీవితం..." రాధకి ఏమంత పెద్దమాటలు రావు. ఆమె కంఠంలో తడి.

మాధవరావు అసంతృప్తిగా పడుకున్నాడు. కొంచెం ఆగి, లేచి, డాబా కొసకి వెళ్ళి నిల్చున్నాడు. తిరిగి వచ్చి పడకుర్చీలో కూర్చున్న రాధవంక చూశాడు. ఆమె ఏడుస్తోందని తెలుసు.

"ఊరుకోమరి...పిచ్చిదానా, నీ జీవితా

నికి నేను చాలా చేశాను. సరేనా? వూరుకో" అన్నాడు.

ఆ రాత్రి ఎప్పటికోగానీ నిద్రపట్టలేదు మాధవరావుకి. రాధ పెళ్ళయిన క్రొత్తలో ఇంకా యిల్లాంటి మాటలు ఎన్నో అనేది. అప్పట్లో తనకి చాలా బాధ కలిగించాయి యీ మాటలు. ఇప్పటికీ మనస్సుకి ఇష్టంగా వుండవు యీ మాటలు. మొదట్లో తనమీది భక్తి, ప్రేమ మాత్రమే అర్థమయ్యేవి—కానీ యిప్పుడు ఈ కృతజ్ఞతా భావంకూడా అర్థమౌతోంది. న్యాయమేనా యీ ప్రవర్తన?...ఏమో!

కుర్చీలోనే పడుకుని నిద్రపోతున్న రాధ వంక చూశాడు—ఆమెని లేపి మంచంమీద పడుకోమని చెప్పాడు మాధవరావు... తను ఆమెని వివాహం చేసుకోకపోతే, యీపాటికి ఆమె జీవితం ఏ పథాన పోయిందో! ఎన్నడూ తల్లిదండ్రులను చూడదు ఆమె. ఎవరైనా దయార్ద్రహృదయులు ఆశ్రయమివ్వాలి. ఈ ఆలోచనల్ని తొలగించుకుంటూ నిద్రపోయాడు అతను-.... అతనికి కలలో తన ముసలి తల్లిదండ్రులు కనుపించారు. అక్క, చిన్న తమ్ముళ్ళు, చెల్లెలు—తండ్రి దచ్చిపోయాడట, కర్మకి, అస్థికి వెళ్ళాడు అతను. ఏమి యేడుపులు...రాధ లేదు అక్కడ; అందరినీ కాదని వెళ్ళిపోయావే అంటున్నారు తమ్ముళ్ళు! ధ్వనులు!...

ఉలిక్కిపడి లేచి, చుట్టూ చూసి, పడుకున్నాడు మాధవరావు.

* * *

చాలారోజులవరకూ పోలేదు యీ కల మాధవరావు స్మృతిలోంచి. నాన్నని చూడాలనిపించింది. అతని మనస్సులోని ఆవేదన ఉవ్వెత్తున లేచింది. తల్లిని తలంచుకుంటే మనస్సుని ఎవరో గుప్పిటపట్టి నులిమివేస్తున్నట్లు బాధ కలిగింది.

"రాధా, మావూరెళ్ళి వస్తాను రెండు రోజులు. నువ్వుండగలవా?" అన్నాడతను ఒక ఉదయాన.

"వెళ్ళిరండి." అన్నది రాధ. వెంటనే అతనికి తోచింది. తన భార్యరావడానికి వీలేనిచోటికి తను వెళ్ళడమా అని. కానీ—ఏమంటారు వాళ్ళు రాధనిచూసి? పెద్ద తమ్ముడు, మద్రాసులో 'లా' చదివే వాడు ఒక్కడే తన పెళ్ళికి ఒక ఉత్తరం వ్రాశాడు. తల్లి, తండ్రి ఆశీర్వదించలేదని అప్పట్లో మాధవరావుకి అనిపించింది, కానీ అల్లా దూరానికి త్రోసేశాడు ఆ అంశాన్ని. ఇప్పుడు?....

"నువ్వు పోనీ ఎక్కడికైనా—" మాధవరావుకి మళ్ళ ఆలోచనసాగింది. ఆమె ఎక్కడికి వెడుతుంది. తను ఒక స్తంభం లాంటి వాడు. తన నల్లుకున్న లత ఆమె.

"వద్దు...ఏ నా సెలవు దొరకవద్దూ నాకు?" అన్నాడతను. రాధకోసం—నిజమే, రాధకోసం తను మనస్సుచేసే కొన్ని స్పందనలను త్రోసి పుచ్చాలి అప్పట్లో తండ్రి ఒక సంబంధాన్ని చూసి వుంచాడు. తను వేసవిలో యింటికి వచ్చేసరికి. తను అంతకుముందే శరణాలయంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు. మేలో రాధని చూశాడు—ఉద్యోగం ఇంటర్వ్యూ కూడా అప్పుడే జరిగింది. తనకోరిక చెప్పగానే తండ్రి కేకలేశాడు, తల్లి దిగులు పడింది. ఈ గొడవలన్నీ వారంరోజులు కూడా వినవక్కర్లేకుండానే ఉద్యోగం ఆర్డరు వచ్చింది. మొదటిరెండు నెలల జీతంలో డబ్బు వెనకేసి, పెళ్ళిఖర్చులు పెట్టుకున్నాడు. ఇదంతా జరిగి ఏడాది కావస్తోంది.

ఆనాటికీనాడు తన అనుభూతుల వెలువలోంచి బైటపడి, అయ్యో మా నాన్న, మాఅమ్మ అనుకున్నాడు. తనవాళ్ళని, వాళ్ళ యిష్టాలని త్రోసిపుచ్చాడు. కట్నం, కొంచెం పెద్దఉద్యోగం, తల్లిదండ్రుల మనశ్శాంతి—రాధకోసం యివన్నీ త్యాగం చేశాడు...రాధ ఏమి త్యాగం చేసింది తన కోసం?—ఆమె అదృష్టవంతురాలు.

తునకలు తునకలుగా యీ ఆలోచనలు మాధవరావు మనస్సులో రోజంతా మెసులుతూనే వున్నాయి—క్లాసులో పాఠాలు చెపుతున్నంతసేపు.

సాయంత్రం యింటికి వచ్చేసరికి రాధ తలదువ్వుకుంటోంది. అద్దంలో అతనిని చూసి నవ్వింది. తరువాత చేతులు కడుక్కునివచ్చి, అతనికి కాఫీయిచ్చి, ప్రక్కన కూర్చుంది. మాధవరావు కాఫీత్రాగుతూ, కిటికీలోంచి బయటకు చూడసాగాడు.

"ఏమిటి విశేషాలు కాలేజీలో?" అన్నది రాధ.

కాఫీ యింత బాగాచేయడం ఎక్కడ నేర్చుకున్నావు? శరణాలయంలోనా."

రాధముఖాన చిరునవ్వు ఏమైంది-అనుకున్నాడు అతను ఆమె తలవంచుకుంది. "అక్కడ మాకు కాఫీయిచ్చేవారు కాదు. ఇక్కడికి వచ్చిన తర్వాతే—అంతకు ముందు మాయింటో..."

మాయిలు! నవ్వొచ్చింది మాధవరావుకి. "నాకు పుట్టిల్లు వున్నట్టే, నీకూవుంది కాదూ? యిద్దరికీ ఒకేదూరం..." అన్నాడు. అతని కంఠం అతనికి ఏమంత కర్కశంగా లేదు.

రాధ రాత్రి పరధ్యానంగా వున్నది. భోజనం చేస్తూ అన్నాడు మాధవరావు, "మీ పూర్వపు అత్తిగారిలు ఏవూరు?" అని. మజ్జిగపోస్తున్న ఆమె చేయి వడకడం స్పష్టంగా కనిపించింది అతనికి. ఆమె మజ్జిగగిన్నె మీద మూతపెట్టి, అతని గ్లాసులో మంచినీళ్ళు పోసింది. అతను భోజనం చేసిన తర్వాత కంచం తీసేసింది. "నెల్లూరుదగ్గర పల్లెటూరు" అన్నది, అతను చేతులు కడుక్కుంటుంటే.

మాధవరావు పైకి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి శనివారం కాబట్టి ఉపవాసంరాధ. ఆ సంగతి తెలిసి, మామిడిపళ్ళు తీసుకు వచ్చాడు అతను.

"తిన్నావా?" అనడిగాడు పదింటికి. "ఆ" అన్నదామె. అతను పడకకుర్చీలో కూర్చున్నాడు. ఆమె పిట్టగోడనానుకుని నిలబడి రోడ్డుమీది మనుష్యుల్ని చూస్తోంది.

"రాధా, కోపమొచ్చిందా, నేను ఏవేవో ప్రశ్నలు వేస్తున్నందుకు?" అన్నాడతను-అప్రయత్నంగా. ఐనా ఎందుకు రావాలి ఆమెకి కోపం? మీమీద కోపం రావడమా? మీరు దేవతలు" అనేది కాదూ రాధ మొదట్లో. "దేవతలమీదకూడా ప్రణయకోపాలు చూపొచ్చు. అని నవ్వేవాడు మాధవరావు అప్పట్లో."

రాధవచ్చి కుర్చీపీటమీద కూర్చుంది. ఆమె చేతులు, మెడ, చెవులు తెల్లగా, స్నిగ్ధంగా వున్నాయి. అందమైన చిన్ని, తెల్లని పూవులాగా వుంది ఆమె.

"రాధా!" అన్నాడతను. ఆమె తలెత్తి చూసింది. ఆ రోజు శరణాలయంలో—బెరుకు, భయం, అమాయకత్వంతోనిండిన చూపు చూసింది.

నా రాధ—నా ఈ చక్కనిరాధ గోదావరి వడిలోకి పోతుంటే ఎవరో—రక్షించారు. ఎవరో అనుకున్నాడతను.

"రాధా, నాకు ఎన్నో విషయాలు చెప్పాలి నువ్వు - చెప్పవేం ఎప్పుడూ" రాధ మాట్లాడలేదు.

"ఆవిడ చెప్పింది నాకు నిన్నుగురించి-నేనుఅంటూండేవాణ్ణి యింటరులోవుండగా. నేను ఎంతో అందమైన అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని. అప్పట్లో చాలా పుస్తకాలు చదివేవాడిని. సినిమాలు చూసేవాడిని...మొదట్లో నువ్వు నాకువంగి నమస్కారం చేసినప్పుడు సినిమాలో లాగా అనిపించింది...రాధా, వీరేశలింగం గారి పుస్తకాలు చదివావా నువ్వు?..."

రాధ నిద్రపోతోందా అని తలవంచి చూశాడు ఆమెవంక. లేదు. విశాలంగా కళ్ళు తెరుచుకుని చూస్తోంది దూరాన్ని. అస్పష్టంగా కదిలాయి ఆమె పెదవులు "అవును. వితంతూద్ధరణ చేశారయ్యో" అన్నది మెల్లిగా.

"అవును రాధా-ఆయన చాలా గొప్పవాడు ... నీకు నిద్ర వస్తోంది. పడుకో." అన్నాడు మాధవరావు.

ఉత్సాహంగా కబురు చెప్పడం చేత కదా ఈ రాధకి అనుకున్నాడు, ముడుచుకుపోయిన కలవపూవులా కనుపించింది అతని కళ్ళకి ఆమె.

★ మరలివచ్చిన మనస్సు ★

ఉదయం పదిదాటినా మాధవరావు పడక కుర్చీలో కూర్చునేవున్నాడు. రాధ ఒకటి రెండుమార్లు అతనివంక చూసింది. అతను కదల్లేదు. చీకాకుగా వున్నాయి అతని ఆలోచనలు. తన జీవితంలో, తన దయాదాక్షిణ్యాల ఫలితంగా ప్రవేశించింది రాధ. ఎందుకని దూరంగా, తన జీవన పథంలోంచి తొలగి నడుస్తోంది — తన అనుజ్ఞలేకుండా? అర్థంలేని చీకాకు అతని మనస్సులో.

"రండి భోజనానికి." అన్నది పదిన్నరకి రాధ.

"ఇప్పుడు-వద్దు — కాలేజీకి సెలవుచీటీ వ్రాస్తాను" అన్నాడు.

ఆమె కాగితం, కలంయిచ్చి, ఉత్తరం వ్రాయించుకుని, ప్రక్కింటి స్టూడెంటుని కేకేసి, యిచ్చింది.

ఒక పావుగంట తర్వాత కేకలేశాడు మాధవరావు రాధని. "ఇవాళ పద్ధెనిమిది రాధా —ఎల్లుండికి మనపెళ్లి జరిగి ఏడాది... నీ జీవితగమనం మారి యిన్ని వందల రోజులైందన్నమాట." బరువుగా అనలేదు మాధవరావు యీ మాటలు.

రాధ తలూపి, లోపలికి వెళ్ళింది మళ్ళీ. ప్రొద్దున్న పదకొండింటికి ఎంత సందడిగా వుంటుంది మాయింట్లో, మావూళ్ళో. కిటికీ మీదుగా ప్రాకిన కాశీరత్నంతీగమీద ఎండ పడుతోంది. వెచ్చగావుంది యీ యిల్లు. వేడిగా, ఉక్కగావుంది యీ వాతావరణం అనుకున్నాడు మాధవరావు.

భోజనంచేస్తూ చెప్పాడు మాధవరావు. "నేను రేపు మావూరు వెడుతున్నాను. నాన్నకి అసలే బాగుండటంలేదని తమ్ముడు వ్రాశాడు. నాల్గురోజులు సెలవు పెడుతున్నాను." అని, రాధ ముఖంలోకి చూశాడు —మార్పులకోసం.

"ఒక్క ఏడాదంతా మా అమ్మను చూడకుండాఎప్పుడూ లేను...మీ అమ్మనువ్వంటే ప్రేమగావుండేదా? నువ్వు అత్తవారింట్లో ఎన్నాళ్ళుండిపోయావు, మీ అమ్మను చూడకుండా?" అన్నాడు. సమాధానం ఆశించలేదు అతను. రాలేదు సమాధానం.

అతని భోజనమైనతర్వాత వంటింటి తలుపువేసి, అతనికి తమలపాకులు అందించింది రాధ. కిటికీదగ్గర నిలబడి, లెక్కలేనన్ని సార్లు, ఆ కిటికీ చువ్వలని లెక్కపెట్టింది వ్రేళ్ళతో.

మాధవరావులో ఏదో ఆవేశం—నిర్మలమైనదీ, స్వచ్ఛమైనదీ కాదు...పరవళ్ళు త్రొక్కుతోంది. గొంతులో పెనగలాడుతున్నాయి కసిరైనమాటలు. రాధ అసహజంగా ప్రవర్తిస్తోంది. అయ్యోవెళ్ళవద్దు మీరు, అనదు ఆమె తను చూపించిన ప్రేమాభిమానాలు అర్థంకాలేదు ఆమెకి.

"నాసామాను సర్దు రాధ. 25కి వస్తాను తిరిగి...ఇల్లావచ్చి కూర్చో. నేను ఆనందంగా ఉండడం నీకిష్టంలేదూ?" అన్నాడతను.

రాధ ఉలిక్కిపడి. అతనివంక చూసింది.

"ఎందుకు కళ్ళు విచ్చుకుని ముఖంలో అంత దైన్యం తెచ్చిపెట్టుకుని చూస్తావు? నా మనస్సు ఎటు మొగ్గుతుందో, ఏ ఆలోచనలు నాకు సంతోషం కలిగిస్తాయో అక్కర్లేదూ నీకు? నీకు ఎవరూలేరు — కానీ నాకున్నారు. నీకు ఆత్మహత్య చేసుకునే స్వాతంత్ర్యమైనా ఉన్నది ఒకప్పుడూ, ఇప్పుడూనూ. నాకదిలేదు. నన్నాధారం చేసుకున్న నువ్వూ, నామీదే ప్రాణాలుంచిన నావాళ్ళున్నారు..." అతనికంఠం వణకటంలేదు.

"నాపట్ల చూపవలసిన భావమేమిటో నీకు తెలియదు? ఇటువంటి అలక్ష్యం నేనుభరించలేను...రాధ, నేను జీవితంలో పొరబాటు చేశానన్న బాధ నాకు యింకా కలిగించకు. నీకు పుణ్యముంటుంది ... ఋణానుబంధం వల్ల తారసపడ్డావు నీవు..."

తెల్లగా పాలిపోయి, వణుకుతున్న చేతుల్లో ముఖందాచుకుంది రాధ. భావురుమని, బిగ్గరగా, హృదయ విదారకంగా ఏడ్చింది ఒక్కసారిగా.

"ఎందుకేడుస్తావు? నీకు నేను ఏమిచేయలేదని? నా జీవితమంతా నీకోసం మార్చివేసుకున్నానే! నేను ఏం కొరత చేశాను నీకు?...నీకు తెలియదు కిరణాలయాల్లోని వితంతువుల జీవితంలో ఎల్లాంటి అగచాట్లకు గురి ఔతారో. చాలీచాలని జీతాలు, పనికిరాని చదువులు, దొరికితే అవలక్షణమైన ఒకరెండోభర్త...ఎందుకేడుస్తావుయింకా? అర్థంలేని ఏడుపుని చూస్తే నాకు అసహ్యం వేస్తుంది."

ఆమె ఎక్కిళ్ళు మెల్లిగా తగాయి. వాన వెలిసింది, కానీ కారుమబ్బులతో దిగులుగా వుండే ప్రకృతిలావుంది ఆమె వదనం.

మాధవరావు ఏవగింతగా ముఖం ప్రక్కకు త్రిప్పుకున్నాడు. "లోకంలోని ఆనందాన్ని పారిపోకుండా నిలబెట్టేందుకూడా శక్తి కావాలి—నీకు లేదది" అన్నాడు.

ఆ సాయంకాలమే బయలుదేరాడు— మాధవరావు తన వూరికి. ఇట్కు వీధి మలుపు తిరగగానే అతని మనస్సులో తన యింటివి

(57-వ పేజీ చూడండి)

★ చిఱుచెమటలూ చందనం ★

(12 వ పేజీ తరువాయి)

తన గది కిటికీలో, గుంటకెదురుగా, గువ్వలాగ కాళ్లుముడుచుకుని, తలవెనకికి తలుపుకి జారవేసుకుని చెక్కిళ్ళనిండా కన్నీళ్ళు కారుతూ, కూచునివుంది అలివేలు.

"నాగప్ప పదాలు పాడాలి. లేకపోతే నిద్దరోస్తావుంద"న్నారు చింతాలు మరదళ్ళు.

"అ! నా పిచ్చపదాలకేంగాని. ఎయ్యండి పిల్లా, పోటు. అయినా నాకేం కుశాలగా లేదు ఇయ్యాల" అంది నాగమ్మ తనూ రోకలి పుచ్చుకుంటూ.

సత్యంగారి పాలేరు, పోతురాజు, చింతాలుదగ్గరికి పుగాకొచ్చాడు. రాత్రంతా నిద్రకాస్తూ.

"మీ కాపందు కట్టావున్నట్టూ?" అన్నాడు చింతాలు.

"రాత్రి సందకాడ బత్తీనించీ డాకటేరుని తీసుకొచ్చాడుగా, జమిందారుగారు. మా పెద్ద చెయ్యంటలే. అదేంమందో అదేం కతో, జీవదారపుల్లలై పనిచేసిందంటే; ఇక పరవానేదంట. బతుకుతాడంట. నీకింకా తెల్దా?" అన్నాడు పోతురాజు.

"మా మంచోడయ్యా. మా గొప్ప స్నేహాలు చేసాడుగా. కనికారం గలోడు మారాజు" అన్నాడు చింతాలు.

పోతురాజు స్వరం వినబడగానే అలివేలు చెవులు రిక్కించుకుని విన్నది. అదృశ్య దేవతలకి చేతులు జోడించింది.

మతి వచ్చేటప్పటికి నాగమ్మ పిచ్చిపదం వినబడుతూంది.

"వేసవ్వి కాలాన పూసేను బూరగలూ," ఊం... ఊం. ఎయ్యండి పిల్లా ఎయ్యండి...

"ఆసితో నిలకలూ ఆరునెలలుంటే
పువ్వుపూ సేవరకు పుడికొమ్మనుంటే
కాయకాసేవరకూ కడకొమ్మనుంటే
పండుపండేవరకు పలవల్ని ఉంటే
తినబోతె దూదాయె, తీపిలేదాయె.
మళ్లండి చిలకల్లార మనమన్నా బూవు
లకూ..."

* * *

అలివేలు కదిలింది. పల్చని చీరలోనించీ నెల వెలుగులో, మసకగా మెరిశాయి మెళ్లో మంగళసూత్రాలు... చెమ్మగిల్లిన కన్నుల మల్లె... ★

★ మరలి వచ్చిన మనస్సు ★

(16-వపేజీ తరువాయి)

గురించిన ఆలోచనలు రాసాగాయి. తనదైన, స్వంతమైన లోకంలోకి వెడుతున్నట్లుంది అతనికి......

వీధి మలుపుదగ్గరే కనుపించాడు చిన్న తమ్ముడు "అన్నయ్యా!" అని అరిచి బండి వెనకాల పరుగెత్తుకొచ్చాడు. "అమ్మ నిన్న అంటోంది అన్నయ్య వస్తాడేమోనని—చిన్నన్నయ్య దసరాకిగానీ రాడు." ఆయాసపడుతూ ఏవో చెప్తున్నాడు. యింకా బండినిదాటి పరుగెత్తుకువెళ్లాడు వాడు.

బండి గేటుదగ్గర ఆగేసరికి చెల్లెలు, రెండో తమ్ముడు పరుగెత్తుకొచ్చారు. వాళ్లని కళ్లతో చూశాడే కానీ-మెడవంచి గుమ్మంలోకి తొంగిచూశాడు. అతని గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. ఏనాడో రగుల్కొన్న అగ్నిపర్వతం లాంటిది తమ బాంధవ్యంలోని విభేదం, యీనాడు బ్రద్దలవుతే!...

గుమ్మంలో అక్క నిల్చునివుంది. తల్లి—ముసలిదైపోతోంది మా అమ్మ అనుకున్నాడు మాధవరావు. "మాధవా, రానాయనా. సాయంకాలం బయలుదేరావా, చిట్టీ! వదిన ఏను దింపవులే బండిలోంచి?"—మాధవరావు నీరసంగా నవ్వాడు. "తీసుకురాలేదు. అక్కడేవుంది. నాన్న ఏడీ? ఎల్లావుంది నాన్నవంట్లో?" ప్రశ్నలు రావడంలేదు అతనికి-వదిన! ఎందుకు వీళ్లకి ఆమె అజ!

తల్లిముఖంలో ఆశ్చర్యం చూశాడతను. "అదేమిట్రా, అమ్మాయి ఎల్లా వుంటుంది వంటరిగా: "వాళ్లవాళ్లెవరైనా వున్నారా అక్కడ?" అన్నదామె.

"ఎవరూ లేరు. తనే వుంది." అన్నాడు లోపలకువస్తూ.

ఘర్షణలులేవు. తను పూర్వం సెలవులకి వచ్చినప్పుడు ఎలావుందో యిప్పుడూ అల్లాగేవుంది. తను వీళ్లలోనివాడు—ఆనందంగా, సంపూర్ణంగా వుంది యీ వాతావరణం.

స్నానం చేయడానికి వెడుతుంటే దొడ్లో అడిగింది అక్క "మాధవా, మా మరదలు ఎల్లా వుంటుందిరా, చక్కని దాన్నిగానీ మాధవుడు పెళ్లాడడు అంటుంది అమ్మ. నిజమేనా?" అని.

అప్రయత్నంగా సిగ్గుపడుతూ నవ్వాడు మాధవరావు.

"ఏమో! మరినా కళ్లు పెట్టుకునిచూస్తే బాగానే వుంటుంది." అన్నాడు.

స్నానం చేసినతర్వాత, తండ్రితో కలిసి భోజనం చేశాడు. తండ్రి కుశల ప్రశ్నలు, ఉద్యోగవివరాలు, రాజకీయాలు, ఊళ్లో విషయాలు మాట్లాడి మంచంమీద వ్రాలాడు. విసనికర్ర చేత్తో పుచ్చుకుని, "కానీ—నువ్వు కోడలుని తీసుకువస్తే బాగుండేది. నలుగుర్నీ చూడక్కర్లేదూ తను మాత్రం?" అన్నాడాయన.

లోకంలో చిత్రాలు జరుగుతాయి, మనుష్యులు చిత్రంగా మాట్లాడతారు—ఇదే దానికి తార్కాణం అనుకున్నాడు మాధవరావు.

"ఎన్నాళ్లు సెలవు పెట్టావు అబ్బాయీ?"— రెండోనాటిరాత్రి దగ్గర కూర్చుని అన్నం పెడుతూ అడిగింది తల్లి. తండ్రి పురాణానికి వెళ్లాడు; అక్క దూరపు బంధువులింట్లో శుభకార్యానికి సాయంచెయడానికి వెళింది, పిల్లలు వసారాలో చదువుకుంటున్నారు.

"25 వరకు పెట్టాను...అమ్మా, మీ అందరికీ చాలా కష్టం కలుగలేదు కదే, నేను విధవరాలిని పెళ్లి చేసుకున్నందుకు?"

"ఛీ వూరుకో, అప్రాచ్యపు మాటలు కోడల్ని గురించి అల్లాంటి అమంగళకరమైన మాటలు అనకూడదు" అన్నది తల్లి.

మాధవరావుకి నిజంగానే నవ్వొచ్చింది. "అమ్మా, నీ కొడుకు భార్యకాబట్టి అంత పవిత్రమూ అమ్మా నీకు? అదికాదు. చెప్పు. నాన్న ఏమన్నారు అప్పట్లో? నువ్వేమనుకున్నావు? చెప్పమ్మా..."

లాంతరు వెలుగులో తల్లి చేతిగాజులు మెరుస్తున్నాయి. ఆమె తెల్లనిజుట్టు తేలిగా గాలికి కదులుతోంది. దీపం పూగిసలాడుతూంటే, ఆమె ముఖంమీద వెలుగునీడలు, కష్టసుఖాల్లా పడుతున్నాయి.

"మీ నాన్న నాలుగురోజులు కేకలేశారు. అందరిమీదా – రాత్రిళ్లుమాత్రం పదేపదే అనుకునేవారు పెద్దవాడిల్లా చేశాడని...నా సంగతి కేమున్నది మాధవా, ఇప్పుడు అక్కయ్య రాతచూసి నేను కుమిలిపోవడం లేదూ, అదీ యిప్పుడైతే కొంచెం మనిషైంది కానీ, మొదట్లో ఎల్లావుండేది? అల్లాంటిబాధ ఒక ఆడుదానికి తప్పిందని అనుకున్నాను."

అవతలిగదిలో గిన్నె పడిన చప్పుడైతే, లేచివెళ్ళింది ఆమె. పెరుగు తీసుకువచ్చి వడ్డించింది కొడుక్కి.

"మా నాన్న చిన్నవాడు నీ జాతకం గీసినప్పుడే చెప్పాడు నీకు అనువైన కళ్యాణం జరుగుతుందని- రెండేళ్ళక్రితం పురుషోత్తం

మరలివచ్చిన మనస్సు

గారు చెప్పారు నీకు సంసారసౌఖ్యం వుందని- ఎన్ని సార్లో అనుకున్నాను యీ విషయాలు...నీ మనస్సు మంచిదని నాకు తెలుసు. కానీ మాధవా, నువ్వు రాధని యెందుకు తీసుకురాలేదు చెప్పు?"

రాధా, మాధవుడు! బాగున్నాయి తల్లి నోట యీ పేర్లు వినడానికి.

"నాకేం తెలుసమ్మా యిక్కడి సంగతులు? తీరా ఇక్కడికి వచ్చిన తర్వాత నాన్న కేకలేసి, నలుగురూ పెడముఖాలు పెట్టుకుంటే రాధ ఎంత బాధపడుతుంది? మీరంతా కాంతించిన సంగతి తమ్ముడూ వ్రాయదులేనాకు..."

రాధది అసలే సున్నితమైన మనస్సు—అబద్దం! ఈ సానుభూతి మెదిలింది తనమనస్సులో! బాధతో ముడుచుకు పోతోంది అతని హృదయం!

"అయ్యో పిచ్చినాయనా...మీ నాన్న కాగితం మీద మాత్రం నీపేరు వ్రాశారు కాదు. మాతో ఐనా అన్నారనా నిన్ను చూడాలని వుందని?...అవును గానీ, అక్కయ్యకి చిన్నవాడు వ్రాశాడు, రాధమ్మ చిన్నదేటగా? తల్లీ, తండ్రికికూడా దూరమైంది పాపం. నాలుగురోజులపాటు ఇక్కడుంటే మనస్సుకు శాంతిగా వుండును. నీ సంగతే నీకు పట్టదు, అమ్మాయి సంగతి ఏం చూసున్నావో నువ్వు...అదేమిటి అన్నం త్రోసేసున్నావు ప్రక్కకి?"

"ఎక్కువైందమ్మా" అన్నాడతను చేయి కడుక్కుంటూ.

అతను ఆరుబయట వెన్నెల్లో పడుకున్నాడు. అమ్మవచ్చి మంచంమీద కూర్చుంది అతనిమీద చేయివేసి కాస్సేపాగి అన్నదామె.

"మాధవా, నువ్వు కలతపడుతున్నావు. మనస్సులో ఏవీ ఉంచుకోకు. ఏదో కాదన్న పని చేసినంతలో రక్తస్పర్శలు ఎక్కడికి పోతాయి? ఆయన నీకుతండ్రి కాడా, నువ్వాయనకు కొడుకువి కావా? నీమనస్సుకి నచ్చిన పని మా అందరికీ మాత్రం ఎందుకు కష్టం కలిగిస్తుంది?..."

కోల పాడినట్లు, మధురంగా పక్కా వ్యవతనంలా పవిత్రంగావుంది ఆమె వాక్కు—మాధవరావు చెవులకి.

"రాధమ్మ పుట్టింటినిగురించి తల్చుకుంటూ వుంటుందా ఎప్పుడేనా?" మాధవరావు మాట్లాడలేదు.

తల్లి నవ్వింది: "తల్చుకుని ఏడుస్తూంటుందా? నిజానికి-ఎవరూ లేరుటగా రాధకి? పాపం-" తల్లి కంఠం రుద్ధమైందా అనిపించింది అతనికి.

"తమ్ముడు వ్రాశాడులే అన్నీ-ఇంతకీ ఒక్కత్తే ఉందన్నమాట, ఇరుగు పొరుగు వున్నారా?"

మాధవరావు ప్రక్కకు తిరిగి పడుకుని, కళ్ళకిఅడ్డంగా చేయి పెట్టుకున్నాడు. "నాకు నిద్రొస్తోంది అమ్మా-మధ్యాహ్నం పడుకోలేదుకదూ? నాన్న వచ్చినట్లు న్నారు చూడు" అన్నాడు. అతనికంఠం పొడిగావుంది.

* * *

తెల్లవారుఝామున తల్లి లేస్తూనే మాధవరావు పరుపు చుట్టేసివుండటం చూసింది. అతని గదిలో దీపం వెలుగుతూండడం చూసి, వెళ్ళింది ఆవేపు.

"నేను 5 గంటల బండికి వెడుతున్నానమ్మా-కొంచెం కాఫీ చేసియ్యి." అన్నాడు మాధవరావు పళ్ళాలు కడుతూ.

"ఇంకో రెండు రోజులుంటానన్నావు కాదట్రా?" అన్నదామె.

"లేదమ్మా...పనుంది-కాగితాలు కొన్ని కాలేజీలో ఇవ్వాలి-నాన్నకి చెప్పు."

ఆ ప్రభాత సమయాన రైల్లో కూర్చుంటే తల్లి, తండ్రి, అక్క—తనని గంట్రకితం సాగనంపినవాళ్ళెవరూ స్మృతిలో లేరు మాధవరావుకి.

రాధ ఆరోజు సాయంకాలం గుమ్మం దగ్గర ఎంత దీనంగా వుంది! తనకి ఆసమయంలో ఆమె కళ్ళలోని విషాదచ్ఛాయలు కనుపించలేదు—ఆ వేదన లోతులు స్ఫురించలేదు. కానీ యిప్పుడు!...

ఆమె ఎటువంటిదో తెలియని యీ వ్యక్తులంతా ఎందుకు ఆప్యాయంగా మాట్లాడుతారు ఆమెను గురించి? వీళ్ళంతా ఏంచేశారు ఆమెకి? ఆమె వీరియెడల ఏమి ప్రేమా భిమానాలు చూపించింది అదృశ్యంగా, మౌనంగా వుండి?—తూర్పున పొడసూపిన బంగారు సూర్యకిరణం అతని కళ్ళను తాకింది.

ఎవరికి ఎవరు ఏమి చేస్తారు జీవితంలో, తన తలి తనని కని, పెంచి పెద్దచేసినందుకు కృతజ్ఞత చూపాలని కోరుతుందా? అవ్యాజంగా, అయాచితంగా చూపే చల్లని ప్రేమ అది. 'అమ్మా, నువ్వు నా జీవితానికి యింత చేశావు' అని తను అన్నా, ఆమె చిరునవ్వు నవ్వుతుందే కానీ, ఆ మాట మనస్సులో నిల్పుకుంటుందా? అల్లాంటి అలౌకికమైన, ఉత్కృష్టమైన బాంధవ్యం అది.

తనది, తన భార్యదీ మాత్రం యింత ఉత్కృష్టమైన బాంధవ్యం కాదూ? కానక్కరేదూ?, ప్రేమ, ఆదరం చూపడానికి మనిషిలో ఎంతసౌజన్యం, గొప్పతనం అవసరమో, మనస్ఫూర్తిగా అందుకోవడానికి అంత ఔన్నత్యం కావాలి...రాధ జీవితాన్ని నిర్విచారంగాస్వీకరించి, మౌనంగా ఒడుదుడుకుల నన్నిటినీఅధిగమిస్తోంది. తనలో తానే ఘర్షణలు పడి, ఆమెలో ఏవో ఆపాదించి, కలతలు కల్పించుకున్నాడతను.

'అయ్యో, రాధ ఏమైపోతోందో ఒంటరిగా!' అని రైలుకూతలో కలిసిపోయేలా—సన్నగా—బిగ్గరగా అనుకున్నాడు మాధవరావు. ★

వ్యాధిగ్రస్తులు సలహా పొందండి!

1. పోలియో, 2. ముఖము, మెడ, అవయవములు, పార్శ్వము లేకపూర్తివాతరోగం. 3. రక్తపోటు. 4. చెవుడు. 5. మూగ, నత్తి. 6. గ్రుడ్డి, మెల్ల. 7. మతిభ్రమణ. జబ్బులచే బాధపడు వారందరు మా డాక్టరుగారు కవిరాజ్ ఓంప్రకాశ్ బి.ఏ., భిషగాచార్య, ధన్వంతరి, రిజిష్టర్డ్ ప్రాక్టీషనర్, ఢిల్లీ, వారిని యీ క్రిందిప్రదేశములలో కలుసుకొని వైద్యసలహా పొందండి.

కలకత్తా: బ్రాడ్వే హోటల్ 17-9-58 ఉ॥ 8-12. జాంషెడ్‌పూర్ : బోలివారు హోటల్ 18-9 58 ఉ॥ 8-11. ఖరగ్‌పూర్ : రైల్వే డాక్ బంగలో 19-9-58 ఉ॥ 8-11 కటక్ : కటక్ హోటల్ 20-9-58 ఉ॥ 8-11. బరంపురం-గంజాం : శాంతి విలాస్ హోటల్ 21-9 58 ఉ॥ 7-10. శ్రీకాకుళం: ఉడిపిహోటల్ 22-9-58 ఉ॥ 8-11. విశాఖపట్నం: గ్రీన్‌లాండ్స్ హోటల్, 23 9-58 ఉ॥ 8-11. కాకినాడ: రావ్స్ ఎం. ఎల్. హోమ్, 24-9-58 ఉ॥ 8-11. రాజమండ్రి: శాంతినివాస్, 25-9-58 ఉ॥ 8 11. ఏలూరు: శ్రీ కృష్ణా లంచ్ హోం, 26-9-58 ఉ॥ 8-11 మచిలీపట్నం: ఇంద్రభవన్, 27-9-58 ఉ॥ 8-11 గుంటూరు: ఉడిపి శ్రీ కృష్ణభవన్, 28-9-58 ఉ॥ 8-11 విజయవాడ : మోడరన్ కేఫ్, గవర్నరుపేట 29-9-58ఉ॥ 8-11. నెల్లూరు : నేషనల్ లాడ్జి, బోర్డింగ్ & లాడ్జింగ్, 30-9 58 ఉ॥ 8-11. మద్రాసు : ఉడ్‌లాండ్స్ హోటల్, మైలాపూరు 2-10-58 ఉ॥ 8- మ॥ 12; సా॥ 3-5. బెంగుళూరు: మద్రాస్ ఉడ్‌లాండ్స్ హోటల్ 16-10-58 ఉ॥ 10; మ॥ 1; & సా॥ 2-4. హిందుపూర్ : చాముండేశ్వరి భవన్ 17-10-58 ఉ॥ 8-11. కర్నూలు : శ్రీ వెంకటేశ్వర హోటల్, 18-10-58 ఉ॥ 8-11. హైద్రాబాద్ : తాజ్ మహల్ హోటల్ కింగ్ కోఠీ రోడ్, 19-10-58 ఉ॥8-12 & సా॥ 1-3.

యితర అడ్రసులకు:

ARYAVARTA POLIO ASHRAM.

114-E, Kamla Nagar, Delhi-6.

ఫోన్: 27858. తంతి: "Poliocure"

పై వ్యాధులను నివారణ విధానములను తెలుపు చిత్రములతోనున్న పుస్తకం "Polio-myelitis & Ayurveda" (ఇంగ్లీషు) ప్రతివెల రు. 7-50; పోస్టేజి 90 న. పై.